క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలివెళ్లిన శ్రేణులు



కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం రుషికొండలోని ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో నాలుగు కార్లు, 10 బైకులతో బయలుదేరి వెళ్లారు. పార్టీ 51వ వార్డు నాయకులు, బీసీ, ఎస్సీ, మహిళా నాయకురాలు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి పార్థివ దేహం అప్పగింత



ఏఎంసీ వైద్యులకు మూర్తి పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న బంధువులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన బాలయ్యశాస్త్రి లేఔట్‌కి చెందిన తణుకు వెంకట సత్యనారాయణ మూర్తి(78) మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన అనకాపల్లిలో కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సావిత్రి ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరణానంతరం దేహ దానానికి విల్లు రాసిచ్చారు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సత్యనారాయణ మూర్తి అంతిమ కోరిక మేరకు కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో శరీర దాతల సంఘం జిల్లా కార్యదర్శి వై. నూకరాజు సత్యనారాయణమూర్తి పార్థివ దేహాన్ని ఏఎంసీకి అప్పగించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



యల్లబిల్లివారి వీధిలో ఇంటి డెకింగ్‌ను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధి పాత రామారావు హాస్పిటల్ పక్కన ఓ ఇంటి యజమాని అక్రమ నిర్మాణం చేపట్టాడు. కూటమి నాయకుల అండదండలతో కంచరపాలెం ముత్యమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మెయిన్ రోడ్డును పూర్తిగా ఆక్రమించి శ్లాబ్ వేసేందుకు డెకింగ్ ఏర్పాటు చేసి పనులు చేపట్టాడు. స్థానికుల ఫిర్యాదులతో శనివారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శి చైతన్య, జోన్-5 టౌన్ ప్లానింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆక్రమించిన ముందు భాగాన్ని, డెకింగ్‌ను తొలగించారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

- ఈ నెల 6,7 తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం-పూరీ-విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం-పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7న పూరీలో బయల్దేరాల్సిన పూరీ-విశాఖపట్నం(08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

ఇక్కట్లు.. ఎన్నాళ్లు?



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ వద్ద పైప్‌లైన్ పనులతో మట్టి తేలిన రహదారి



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఇంటి ముందు తవ్వేసిన రోడ్డు

- ముందుకు సాగని.. 24/7 మంచినీటి పైప్‌లైన్ పనులు
- 14వ వార్డులో ఎక్కడికక్కడ తవ్వి వదిలేసిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు



లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్ పక్కన తవ్వి వదిలేసిన వ్యర్థాలు

తాటిచెట్లపాలెం: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న 24/7 మంచినీటి పైప్‌లైన్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు కానీ.. వీటి వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడ రహదారులను తవ్వేసి వదిలేయడం వల్ల ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. అమృత్ పథకం కింద మొదటిసారి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా రోడ్లను తవ్వేసి సుమారు 5 ఏళ్ల పాటు ప్రజలకు నరకం చూపించారు.

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి.. నగరంలో తవ్విన రోడ్లకు మరమ్మతులు చేశారు. కొన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మించారు.

గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పుడిప్పుడే వేసిన రోడ్లను తవ్వేసి మళ్లీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. చాలా చోట్ల నెలలు గడుస్తున్నా.. కొంచెం కూడా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నిత్యం స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల కనీసం ప్రజల ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా రోడ్లు తవ్వేశారు. పని పూర్తయిన వెంటనే వాటిని పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీంతో రోజులు కాదు.. నెలల తరబడి మట్టి రోడ్ల మీదకు వచ్చి ఇబ్బందికరంగా మారుతోంది. అసలే వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఇటువంటి సందర్భంలో ద్విచక్ర వాహనాలు రహదారులపై బురద, మట్టి వల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

తాత్కాలిక పనులు..

ఒకవైపు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణ సమీపిస్తోంది. దీంతో భక్తులు గిరి ప్రదక్షిణ చేసే మార్గంలో మాత్రం ఆఘమేఘాల మీద రాత్రికి రాత్రి తాత్కాలికంగా తవ్విన గోతులను కాంక్రీట్‌తో(కేవలం గిరిప్రదక్షిణ మార్గంలో) పూడ్చుతున్నారు. వీటి నాణ్యత ప్రశ్నార్థకమనే చెప్పాలి.

అడుగడుగునా గోతులే..

జీవీఎంసీ 14వ వార్డులోని సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నరసింహనగర్ ప్రాంతాల్లో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఏ రోడ్డు, ఏ కాలనీని చూసినా 24/7 మంచినీటి పైప్‌లైన్ పనుల కోసం తవ్వి వదిలేసిన గోతులే కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రహదారులను కూడా తవ్వేస్తున్నారు. ఇలా ప్రతి చోట పైప్‌లైన్ పనుల కోసం రోడ్లను తవ్వి వదిలేయడంతో ఎన్నాళ్లీ.. ఇక్కట్లని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన తరువాత రోడ్లు వేయొచ్చు కదా? ఎందుకిలా రోడ్లు నిర్మించడం, మళ్లీ తవ్వడం, మళ్లీ వేయడం.. ఇలా ప్రజాధనం ఎందుకు వృథా చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరతిగతిన పనులు పూర్తి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



కిమ్స్ ఆస్పత్రి ఎదురుగా రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా గోతులు



సీతమ్మధారలో రోడ్డును తవ్వేయడంతో గోతిలో కూరుకుపోయిన కారు

లక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం



అభిషేక సేవలో లక్ష్మీనరసింహ స్వామి

సీతంపేట: ఆషాఢ మాసం, దశమి స్వాతి నక్షత్రం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పంచామృతాభిషేకం జరిపించారు. పండితుల వేద మంత్రాల మధ్య అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అభిషేకంలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి దర్శనమిచ్చారు. అనంతరం విశేష హారతులిచ్చారు.

తల్లీకుమార్తె అదృశ్యం

తాటిచెట్లపాలెం: మైనర్ కుమార్తెతో సహా తల్లి అదృశ్యమైన ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో నివసిస్తున్న బత్రి నందిని తన కుమార్తె నక్షత్ర(8)తో కలిసి ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ ఇప్పటివరకు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరి ఆచూకీ తెలిసిన వారు ఫోర్త్ టౌన్ పీఎస్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసే వరకు పోరాటం

తాటిచెట్లపాలెం: అదానీ గ్రూప్, సెకీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగుల గొట్టాలని, అదానీ, సెకి సంస్థలతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. నేడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మూడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను మరచి కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్లాది రూపాయల ప్రజల కష్టార్జితాన్ని దోచిపెట్టే విధానాలను అనుసరిస్తున్నాయని ఆరోపించారు. విద్యుత్ ఒప్పందాల రద్దు, పెంచిన కరెంట్ చార్జీల తగ్గించే వరకు కలిసొచ్చిన వామపక్షాలు, ఇతర పార్టీలతో కలిసి ప్రజలను ఐక్యం చేసి పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సి.ఎస్.క్షేత్రపాల్, సత్యాంజనేయ, వనజాక్షి, ఆర్.శ్రీనివాస్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సమితి సభ్యులు ఎండి బేగం, పద్మ, జి.రాంబాబు, కాసుబాబు, గోవింద తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మధురానగర్ హైస్కూల్‌లో వైద్య శిబిరం



విద్యార్థులకు పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లో శనివారం అమెరికన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. హాస్పిటల్ వైద్య సిబ్బంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు దీప్తి, రాజ్యలక్ష్మి, సింధూర, మాధవి, జానీ సూరజ్, భార్గవ్, నర్సింగ్ స్టాఫ్ వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ రాంజీ



ప్రమాణం చేస్తున్న క్లబ్ నూతన సభ్యులు

మురళీనగర్: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ కనీసం 45 నిమిషాలు నడవాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాంజీ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం వాకర్స్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే నడక, వ్యాయామం, మంచి నిద్ర అవసరమన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. క్లబ్ నుంచి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా అవకాశం రావడం తనకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా జూలైలో పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు బుచ్చయ్య మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులందరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో ద్వారకానాథ్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, డైరెక్టర్లు పి.సతీష్‌కుమార్, జి.రామకృష్ణ, పి.గిరిధర్, ఎస్.సర్వరాజ్ పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష సేవలు



తులసి మాలల అలంకరణలో వేంకటేశ్వరుడు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరుడికి తిరుపతి తరహాలో జేష్ఠమాసం తొలి శనివారం నుంచి విశేష సేవలు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతం, తోమాల సేవ, అర్చన అనంతరం తులసి మాలలతో ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అర్చన, విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామాల పారాయణ, నక్షత్ర హారతి ఇచ్చారు. రాత్రి కల్యాణ వేంకటేశ్వర స్వామికి క్షీర నివేదన, పవళింపు సేవ నిర్వహించారు. ప్రతి శనివారం ఆయా సేవలు జరగుతాయని, భక్తులు పాల్గొని తరించవచ్చని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పవళింపు సేవలో దంపతులిద్దరిని అనుమతిస్తామని, సేవలో పాల్గొన దలచిన వారు ఆఫీసులో సంప్రదించవచ్చని సూచించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు కల్యాణ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో సామూహిక భగవద్గీత పారాయణ జరుగుతుందని, ఆసక్తి గల భక్తులు పాల్గొని పారాయణ చేయవచ్చన్నారు.

శాంతియుత ప్రపంచం నిర్మిద్దాం

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో శనివారం 'హింసాయుత ఘర్షణలకు ముగింపు పలికి శాంతియుత ప్రపంచ వ్యవస్థను నిర్మిద్దాం' అనే అంశంపై శనివారం చర్చా కార్యక్రమం జరిగింది. బీవీ ఫౌండేషన్, గాంధీ సెంటర్, యూఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీవీఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు, శిశువులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాజాన్ని తరాల వారీగా విచ్ఛిన్నం చేసే కుట్రతత్వ విధానంగా పేర్కొన్నారు. ప్రొఫెసర్ కె.రవి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో అభివృద్ధి చెందుతున్న ఆయుధాలు ప్రపంచానికి ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. గురుద్వారా అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ మాట్లాడుతూ రాజకీయం, మతం, ఆర్థిక అంశాలే యుద్ధాలకు ప్రధాన కారణాలన్నారు. గురుగోవింద్ సింగ్ నాయకత్వంలో జరిగిన సిక్కుల హక్కుల పోరాటాలను గుర్తుచేశారు. మాజీ డీఐజీ అత్తిలి సుధాకర్ మాట్లాడుతూ యుద్ధ ఖైదీలకూ హక్కులు ఉంటాయని, వాటిని ఏ దేశాలు గౌరవించడం లేదన్నారు. ప్రొఫెసర్ పద్దయ్య, ప్రొఫెసర్ పి.కె.జోషి, ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్, కె.వి.ఎస్.మూర్తి తదితరులు ప్రసంగించారు. ముందుగా గాంధీ విగ్రహానికి వక్తలంతా నివాళులర్పించారు.



గాంధీ సెంటర్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వక్తలు

రచయితలు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలి

సీతంపేట: కవులు, రచయితలు సమాజంపై బాధ్యతతో మెలగాలని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 11వ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలు నిరంతరం సామాజిక చైతన్యం కలిగించే రచనలు చేయాలన్నారు. రామసుబ్బయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య మక్కెన శ్రీను మాట్లాడుతూ తెలుగు భాషకు ఇతోధికంగా సేవ చేయాలన్న లక్ష్యంతో 11 ఏళ్లుగా ప్రతి ఏటా కవులు, రచయితలకు సాహితీ పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. సాహిత్య పత్రికల సహకారంతో ఏటా కవితలు, కథలు, వ్యాసాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారానికి ఎంపికైన మల్లారెడ్డి మురళీమోహన్, డాక్టర్ కె.వి.రావు సాహిత్య పురస్కారానికి ఎంపికైన ర్యాలీ ప్రసాద్, మక్కెన రామసుబ్బయ్య కథా పురస్కారానికి ఎంపికైన అచ్చళ్ల ఉమామహేష్, బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన కె.వి.లక్ష్మణరావు, మనోవికాస వైజ్ఞానిక సాహిత్య పురస్కారానికి ఎంపికైన పి.చంద్రశేఖర ఆజాద్‌లకు మక్కెన శ్రీను చేతుల మీదుగా నగదు పురస్కారం అందజేసి సత్కరించారు. విశాఖ సంస్కృతి సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన సభలో మేడా మస్తాన్‌రెడ్డి, రచయితలు ఎం.సుగుణరావు, మాకినీడి సూర్యభాస్కర్, జడా సుబ్బారావు, కె.ఎ.ముని సురేష్ పిళ్లై తదితరులు పాల్గొని రామసుబ్బయ్య ఫౌండేషన్ సేవలను కొనియాడారు.



మాట్లాడుతున్న కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు

శేషజీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సీతంపేట: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ట్రాఫిక్(షిప్పింగ్) రిటైర్డ్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదవీ విరమణ చేసి వయసు పైబడిన సమయంలో సభ్యులంతా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక, యోగా క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను దృష్టిలో ఉంచుకుని మితాహారం భుజించాలన్నారు. సభ్యుడు ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ సభ్యులంతా భార్యాభర్తలిద్దరి పేరుతో బ్యాంకు అకౌంట్ నిర్వహించాలన్నారు. స్థిర, చరాస్తులను పిల్లలందరికీ సమానంగా చెందేలా వీలునామా రాయడం ద్వారా భవిష్యత్‌లో ఆస్తుల పంపకం విషయంలో సమస్యలు, గొడవలు తలెత్తకుండా ఉంటాయని సూచించారు. అనంతరం సభ్యులంతా తమ దైనందిక దిన చర్యను వివరించారు. కార్యక్రమంలో బి.కె.సింహాచలం, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

నేత్రపర్వంగా జగన్నాథుడి రథయాత్ర

మురళీనగర్: దేవదేవుడు జగన్నాథ స్వామి బహుడ (తిరుగు) రథయాత్ర హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించన భక్తదాస ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో భక్తులు అత్యధికంగా పాల్గొన్నారు. ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వర్మా కాంప్లెక్స్ మీదుగా ఈస్ట్ పార్కు, మాధవధార కమ్యూనిటీ హాల్ వరకు నేత్రపర్వంగా యాత్ర సాగింది. వైభవుడి ఆలయ అర్చకుడు గోపినంబళ్ల శేషాచార్యులు, ఈవో బండారు ప్రసాద్ రథయాత్రను విజయవంతం చేసేందుకు సహకరించారు. సర్వాంకాలంకృతుడైన జగన్నాథుడిని అందంగా అలంకరించిన పూల రథం పైకి తోడ్కొని వచ్చి ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజల అనంతరం రథయాత్ర నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటాలు, వివిధ సంగీత పరికరాలతో భక్తులు సంకీర్తనలు చేస్తూ నృత్యాలతో పులకించిపోయారు. శ్రీ సంజన కూచిపూడి నృత్యాలయం విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దారి పొడవునా యాత్రలో పాల్గొన్న భక్తులకు స్వామివారి మహాప్రసాదం అందించారు. హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధి యదురాజదాస సమన్వయకర్తగా వ్యవహరించారు.



పూల రథంలో కొలువుదీరిన జగన్నాథుడు



రథయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం

మద్రిపాలెంలో అంధకారం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం మెయిన్ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న ముస్లిం శ్మశానవాటికలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. మసీదు వీధిలోని పోల్ నంబర్ 35/ఏ/8, 305/బీ/3, 305/ఏ/6 వీధిలైట్లు కొద్ది రోజుల నుంచి వెలగడం లేదు. రాత్రి సమయాల్లో అంధకారం వల్ల స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం వీటికి మరమ్మతులు చేసి వెలిగించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు షేక్ బాబ్జీ కోరారు. ఈ సమస్యపై జీవీఎంసీ కమిషనర్ దొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.





మద్రిపాలెం మెయిన్ రోడ్డు, మసీదు వీధిలో వెలగని విద్యుత్ లైట్లు

ముగిసిన సెయిలింగ్ శిక్షణ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం, తీర గస్తీ దళం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన ఓసియన్ సెయిలింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 23 నుంచి భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సర్కార్‌లోని వాటర్ మెన్ షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కి చెందిన 13 మంది సెయిలర్స్ ఈ శిక్షణలో పాల్గొన్నారు. సముద్ర జలాల్లో ఆపత్కాల సమయంలోనూ, విపత్తుల్లో చిక్కుకున్న వారికి రక్షించేలా తర్ఫీదునిచ్చారు. దీంతో పాటుగా సుదీర్ఘ సముద్ర యానానికి సిద్ధమయ్యేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసంతో పాటు మెళకువలు నేర్పించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కోస్ట్ గార్డ్ గోల్డెన్ జూబ్లీ మహా సముద్రయానానికి శిక్షణ తీసుకున్న వారిని సంసిద్ధులను చేసినట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.